7
సాక్షి నిర్మల్
శుక్రవారం : 23 : మే : 2025



నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలంలో వరద ముప్పును నివారించేందుకు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీ సమీపంలోని చెక్‌డ్యామ్‌ను అధికారులు గురువారం పేల్చేశారు. మూడేళ్లుగా వర్షాకాలంలో జీఎన్‌ఆర్ కాలనీ నీట మునుగుతోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ నీటిపారుదల, పురపాలక, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి వచ్చే వర్షాకాలం ముంపు ముప్పు తప్పేలా చెక్ డ్యామ్ ఎత్తు తగ్గించాలని నిర్ణయించారు. ఈమేరకు అధికారులను ఆదేశించగా వారు ఇలా పేల్చేశారు.

న్యూస్‌రీల్

దేశం గర్వించే సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ



నివాళులర్పిస్తున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: దేశం గర్వించదగ్గ సంఘసంస్కర్త భాగ్యరెడ్డివర్మ అని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. భాగ్యరెడ్డివర్మ 137వ జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ జ్యోతిప్రజ్వలన, చిత్రపటానికి పూలమాల చేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి, ముఖ్యంగా దళిత మహిళల విద్యాభివృద్ధికి భాగ్యరెడ్డివర్మ చేసిన కృషి అపూర్వమన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అభివృద్ధి శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, శంకర్, మోహన్‌సింగ్, నరసింహారెడ్డి, దళిత సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ ప్రధాన కార్యాలయంలో..

నిర్మల్‌టౌన్: భాగ్యరెడ్డివర్మ జీవితం నేటి తరానికి ఆదర్శమని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భాగ్యరెడ్డి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఏవో యూనిస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, సమ్మయ్య, ఆర్‌ఐలు రామ్ నిరంజన్, రమేశ్, ఆర్‌ఎస్‌ఐలు రవికుమార్, రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి

- బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వాణన్



నర్సరీని పరిశీలిస్తున్న శర్వాణన్

నర్సాపూర్(జి): వన మహోత్సవానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వాణన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని కేంద్రీయ హరిత నిధి వన నర్సరీ, ఈజీఎస్ నర్సరీలను గురువారం పరిశీలించారు. మొక్కలను బాధ్యతాయుతంగా సంరక్షించాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతంలో గతంలో నాటి ఏపుగా పెరిగిన వివిధ రకాల పండ్ల, ఇతర మొక్కలను పరిశీలించారు. అటవీ జంతువులకు, పక్షులకు ఆహారంగా అవి ఉపయోగపడతాయన్నారు. సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట డీఎఫ్‌వో నాగిని భాను, సారంగాపూర్ డీఆర్‌వో నజీర్ ఖాన్, ఎఫ్‌ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవోలు సాయరెడ్డి, ఫాజిల్ హుస్సేన్ ఉన్నారు.

బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



సూచనలు చేస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

దస్తురాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని మున్యాల జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న డిజిటల్ కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలు

- డీఈవో పి.రామారావు

లక్ష్మణచాంద/ఖానాపూర్: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని డీఈవో రామారావు అన్నారు. మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాలలో, ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురువారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలని సూచించారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఎంఈవోలు ఆర్.అశోక్‌వర్మ, ప్రేమ్‌సాగర్, మండల రిసోర్స్ పర్సన్లు అర్చన, శివరాణి, మోహన్, చంద్రమోహన్, తేజ, సాయన్న, గంగాధర్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు మహేందర్, సుధాకర్, డీఆర్పీలు తిరుమలేశ్, సుజాత, సీఆర్‌పీలు కవిత, వనిత, పాల్గొన్నారు.

రైతుల కష్టం వర్షార్పణం



కడెంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

- అన్నదాతల ఆశలపై వాననీళ్లు
- కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిన ధాన్యం
- కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్
- పలు మండలాల్లో ఆందోళనలు



ఖానాపూర్ మండలంలోని రాంరెడ్డిపల్లెలో రాస్తారోకో చేస్తున్న రైతులు

నిర్మల్: కాలం ఎలా ఉన్నా.. రైతన్నకు కష్టం మాత్రం వెంటే ఉంటోంది. తన సమయం కాకున్నా.. అకాలంలో వచ్చిన వానలు పంట చేతికొచ్చిన రైతులను పరేషాన్ చేస్తున్నాయి. జిల్లాలో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన, సంచుల్లో నింపిన ధాన్యాన్ని తడిపేశాయి. ఇలా తడిసిన ధాన్యాన్ని చేతుల్లో పట్టుకుంటూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈమేరకు జిల్లాలో పలుచోట్ల ఆందోళనలూ చేపడుతున్నారు.

అకాల వర్షం..

జిల్లాలో యాసంగిలో 1.22 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఈ సీజన్‌లో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఈమేరకు జిల్లాలో మొత్తం 318 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా 30 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. కొన్ని మండలాల్లో ఇంకా వరికోతలు, కల్లాలు, ధాన్యం ఆరబెట్టడం చేస్తున్నారు. మరోవైపు కొన్ని కేంద్రాల్లోనూ కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. ఇంతలోనే నైరుతీ రుతుపవనాలు, వాతావరణ మార్పులతో అకాలవర్షాలు దూసుకువచ్చాయి. రైతన్నకు సమయం ఇవ్వకుండా చేతిలో ఉన్న పంటను నీళ్లపాలు చేస్తున్నాయి.

సాగు ఆలస్యం..

రాష్ట్రంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో వరిసాగు కాస్త ఆలస్యంగానే ఉంటోంది. దాదాపు ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాగా, మిగతా జిల్లాల్లో పూర్తయ్యే దశకు చేరాయి. జిల్లాలో మాత్రం ఇప్పటికీ ఇంకా కొంతమంది రైతుల పంట కోత కూడా కాకపోవడం గమనార్హం. ప్రతీ సీజన్‌లోనూ ఇలాగే ఉంటుంది. కానీ.. ఈసారి వర్షాలు ముందుగా రావడం ఇక్కడ రైతులకు ఇబ్బందికరంగా మారింది. మరో రెండురోజుల పాటు ఇలాగే వర్షాలు ఉంటాయన్న వాతావరణ సూచనల నేపథ్యంలో రైతులు కంగారు పడుతున్నారు. ఇప్పటికే చాలామంది టార్పాలిన్‌లను కప్పి, నీళ్లు రాకుండా కాలువలు తీసి, కట్టలు కట్టి పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. భారీగా వర్షాలు కురిస్తే మాత్రం వడ్లు కొట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రైతుల ఆందోళన..

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అన్నదాతలు అమ్ముకునే వేళకు అకాలవర్షం వచ్చిపడింది. చాలామంది ముందస్తుగా టార్పాలిన్‌లను కప్పి పెట్టుకున్నా.. ఆరబెట్టుకున్న ధాన్యంలోకి వర్షపునీరు చేరింది. కాస్త ఏమరుపాటుగా ఉన్న రైతుల వడ్ల సంచులూ తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తేమ పేరిట కొర్రీలు పెడుతూ రైతన్నలను తిప్పలు పెడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో తేమశాతం వచ్చినా.. సీరియల్ నంబర్ వచ్చేదాకా వేచిచూడాల్సి వస్తోంది. ఇది చాలదన్నట్లు రైస్‌మిల్లర్లు కూడా క్వింటాలుకు ఇంత అంటూ కోతలు పెడుతున్నారు. ఇవన్నీ ఎదుర్కొంటున్నా.. ఎంతోకొంత మిగులుబాటు అవుతుందనుకుంటున్న రైతన్న ఆశలపై ఇప్పుడు వాననీళ్లు వచ్చిపడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యం కింద అకాలవర్షంతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని సదరు రైతులు కోరుతున్నారు. ఈనేపథ్యంలోనే పలు మండలాల్లో ఆందోళనలను చేపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ కొనుగోలుకు భరోసా ఇస్తున్నారు.

తడిసిన వడ్లు కొనాలి..



అకాలవర్షంతో కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోయింది. నాతోపాటు చాలామంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. తడిసిన వడ్లను కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి, మద్దతు ధర ఇప్పించాలని కోరుతున్నాం.

– జోగు రాజేశ్వర్, ఖానాపూర్

వేగవంతం చేయాలి..



పదిరోజుల నుంచి సెంటర్‌లోనే ధాన్యం పెట్టుకుని ఉన్నాం. ఈసారి వర్షాలు ముందుగానే వస్తున్నాయి. ఇంకా వానాలు పడుతాయన్న వాతావరణ సూచనలు ఉన్నాయి. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

– కోడె సుధాకర్, నర్సాపూర్(జి)

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం..

- కలెక్టర్ అభిలాష అభినవ్



ఖానాపూర్‌లో తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 80 శాతానికిపైగా ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. ఖానాపూర్ ప్రాంతంలో ఆలస్యంగా నాట్లు వేయడంతో ధాన్యం ఆలస్యంగా వచ్చిందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిందని రైతులు దిగాలు చెందొద్దన్నారు. జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులను ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో ధాన్యం తూకం వేయిస్తామన్నారు. అధికారులు గంటగంటకు అప్‌డేట్‌లు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యంలో ఇష్టారాజ్యంగా కోతలు విధించిన 22 రైస్ మిల్లులపై ఇప్పటికే కేసులు నమోదు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సహకార సంఘం అధికారులు, సిబ్బంది తీరుపై కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ధాన్యం తూకం వేసేందుకు నిర్వాహకులు కమీషన్లు ఆశిస్తున్నారని దీంతో తూకంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. గన్నీ సంచులు, హమాలీలు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డెక్కిన రైతులు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

ఖానాపూర్/కడెం/మామడ/నర్సాపూర్ (జి)/దస్తురాబాద్ : ఖానాపూర్, కడెం, నర్సాపూర్ (జి), మామడ మండలాల్లో రైతులు గురువారం రోడ్డెక్కారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ఖానాపూర్ రైతులు ఎస్‌టీఆర్ చౌరస్తా, మండలంలోని రాంరెడ్డిపల్లె శివారులోని బాసర–మంచిర్యాల ప్రధాన రహదారిపై వేర్వేరుగా రాస్తారోకోలు చేశారు. కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ వద్ద నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. మండలంలోని అంబారిపేట్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పరిశీలించారు. మామడ మండలంల పొన్కల్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధర్నా చేశారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తరుగు పేరుతో కోతలు, హమాలీ, లారీల కొరతల కారణంగా రోజుల తరబడి ధాన్యం కుప్పలు అలాగే ఉంటున్నాయని రైతులు మండిపడ్డారు. తడిసిన ధాన్యాన్ని షరతులు, కోతలు లేకుండా కొనుగోలు చేయాలని, జాప్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లో రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐఎంఎల్ నాయకులు మద్దతు తెలిపారు. కడెంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రైతులతో మాట్లాడి, కొనుగోలుకు హామీ ఇచ్చారు. నర్సాపూర్‌లో ధాన్యం తరలింపు జాప్యం, టార్పాలిన్ల కొరతతో రైతులు రాస్తారోకో చేపట్టగా, తహసీల్దార్ శ్రీకాంత్ సమస్య పరిష్కార హామీతో విరమించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, స్థానిక అధికారుల నిర్లక్ష్యం కారణంగా ధాన్యం కుప్పలు తడిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్ల అదనపు తూకం, తరుగు కోతలతో కూడా నష్టపోతున్నామని పేర్కొన్నారు. దస్తురాబాద్ మండలంలోని రేవోజీపేట, దస్తురాబాద్, బుట్టాపూర్ కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

స్టిచ్చింగ్ స్లో..!

- 20 రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలలు
- బడులు తెరిచేనాటికి యూనిఫాం అందడం కష్టమే..



జిల్లా కేంద్రంలో యూనిఫాం కుడుతున్న మహిళా సంఘం సభ్యురాలు

లక్ష్మణచాంద: పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం బహుముఖ చర్యలు చేపడుతోంది. విద్యార్థులకు సమగ్ర విద్యను అందించేందుకు తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, రెండు జతల యూనిఫాంలను అందజేస్తోంది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు కొత్త యూనిఫాం ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు నెల క్రితమే విద్యార్థులకు అవసరమైన క్లాత్‌ను జిల్లాలకు సరఫరా చేసింది. యూనిఫాం స్టిచ్చింగ్ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించింది. అయితే జిల్లాలో యూనిఫాం స్టిచ్చింగ్ పనులు నిదానంగా సాగుతున్నాయి.

48,874 మంది విద్యార్థులు..

జిల్లాలో 577 ప్రాథమిక పాఠశాలలు, 89 ప్రాథమికోన్నత పాఠశాలలు, 164 ఉన్నత పాఠశాలలు, 18 కేజీబీవీలు, ఒక మోడల్ పాఠశాలలో మొత్తం 48,874 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులందరికీ ఉచిత రెండు జతల యూనిఫాంలు అందించేందుకు, జిల్లాలోని 531 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు యూనిఫాం కుట్టు పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు 20,500 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాం స్టిచ్చింగ్ మాత్రమే పూర్తయింది. ఒక్కో జత చొప్పున ఇచ్చిన ఇంకా 28,374 జతలు ఈ నెల 31లోగా కుట్టాల్సి ఉంది.

క్లాత్ సరఫరాలో జాప్యం..

ప్రస్తుతం యూనిఫాం కుట్టు కోసం ఒక జతకు సంబంధించిన క్లాత్ మాత్రమే జిల్లాకు సరఫరా అయింది. ఏప్రిల్ 14, 15, 16 తేదీలలో బాటమ్ క్లాత్, షర్ట్ క్లాత్, మే 2,3 తేదీల్లో కొంత భాగం సరఫరా అయింది. క్లాత్ సరఫరాలో జాప్యం కారణంగా కుట్టు పనిలో కొంత ఆలస్యం జరుగుతోంది. రెండో జత యూనిఫాం కోసం క్లాత్ ఇంకా రావాల్సి ఉంది. అధికారులు రెండో జత క్లాత్ వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జతకు రూ.75 చెల్లింపు

ప్రభుత్వం ఒక జత యూనిఫాం కుట్టడానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.75 చెల్లిస్తోంది. గతంలో ఒక జతకు రూ.50 చెల్లించగా, ఈసారి రూ.25 పెంచి రూ.75గా నిర్ణయించారు. ఈ మొత్తంలో రూ.50 కుట్టు కూలీగా, రూ.25 కటింగ్, బటన్స్, కాజాలు వంటి ఇతర ఖర్చుల కోసం కేటాయించారు. ఈ చర్య ద్వారా స్థానిక మహిళలకు ఆర్థిక స్వావలంబనకు అవకాశం కల్పించబడుతోంది.

తరగతుల వారీగా యూనిఫాం డిజైన్లు


1 నుంచి 5వ తరగతి (బాలురు):	చొక్కా, నిక్కర్
6 నుంచి 10వ తరగతి (బాలురు):	చొక్కా, ప్యాంట్
1 నుంచి 3వ తరగతి (బాలికలు):	చొక్కా, లాంగ్ ఫ్రాక్
4 నుంచి 5వ తరగతి (బాలికలు):	షర్ట్, స్కర్ట్
6 నుంచి 10వ తరగతి (బాలికలు):	పంజాబీ డ్రెస్

వేగం పెంచుతాం

పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలను కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించాం. ఇప్పటి వరకు 20,500 జతల స్టిచ్చింగ్ పూర్తయింది. ఈ ప్రక్రియను మరింత వేగం చేసి త్వరగా పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులకు అందజేస్తాం.

– కేవీఎస్.ప్రసాద్, డీపీఎం డీఆర్డీఏ

ప్రారంభానికి అందేలా చూస్తాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందచేసే యూనిఫాంలు పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అందజేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా సంఘాల సమన్వయంతో స్టిచ్చింగ్ ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేసేలా పర్యవేక్షిస్తున్నాం.

– రామారావు, డీఈవో

అవగాహనతో మోసాలకు చెక్

- 25 వరకు అంతర్జాతీయ తూనికల వారోత్సవాలు
- జిల్లాలో కనిపించని కార్యక్రమాలు
- రెగ్యులర్ అధికారిగా శంకర్ నియామకం



భైంసాటౌన్: అంతర్జాతీయ తూనికలు, కొలతల దినోత్సవం (మే 20) సందర్భంగా లీగల్ మెట్రాలజీ శాఖ వారోత్సవ కార్యక్రమాలను(మే 25 వరకు) నిర్వహించాలని నిర్ణయించింది. వినియోగదారులను తూకాల్లో మోసాలపై చైతన్యపరచడం, కచ్చితమైన కొలతలను నిర్ధారించడం ఈ కార్యక్రమాల లక్ష్యం. అయితే, జిల్లాలో ఈ కార్యక్రమాలు నిర్వహించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

తూకాల్లో మోసాలు..

జిల్లావ్యాప్తంగా వ్యాపారులు కూరగాయలు, బియ్యం, మాంసం, పెట్రోల్ వంటి వస్తువుల తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. రైతులు కూడా పంట విక్రయంలో మోసపోతున్నారు. ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలు, వేబ్రిడ్జిలు, పెట్రోల్ పంపులలో తనిఖీలు సక్రమంగా జరగకపోవడం ఈ సమస్యలకు కారణం. దీంతో నిత్యం వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. నివారణకు తూనికలు, కొలతల శాఖ పర్యవేక్షణ చేపట్టాలి. తరచూ ఎలక్ట్రానిక్ కాంటాలు, మ్యానువల్ కాంటా బాట్లు, వేబ్రిడ్జిలు, ప్యాకింగ్ వస్తువులు, పెట్రోల్ పంపులు తనిఖీ చేయాల్సి ఉంటుంది.

ఇన్‌చార్జి అధికారుల కొరత

జిల్లాకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జి అధికారులు పనిభారంతో పర్యవేక్షణను నిర్లక్ష్యం చేశారు. దీంతో మోసాలు అరికట్టడం సాధ్యం కాలేదు. 'సాక్షి' కథనాల ఒత్తిడితో ఇటీవల రెగ్యులర్ అధికారిని నియమించారు. ఇకనైనా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, వినియోగదారులకు కచ్చితమైన వస్తు సేవలు అందించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి...

జిల్లాలో కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు, వేబ్రిడ్జిలు, ప్యాకింగ్ వస్తువులపై తప్పుడు వివరాలు ముద్రించి వినియోగదారులను మోసగిస్తున్నారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టాలి. వినియోగదారులకు అవగాహన కల్పించి, మోసపోకుండా చర్యలు చేపట్టాలి.

– కూన గంగాధర్, వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

తనిఖీలు చేపడతాం...

ఎవరైనా తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ఎలక్ట్రానిక్, మ్యానువల్ కాంటాలకు నిబంధనల మేరకు స్టాంపింగ్ వేయించుకోవాలి. జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. తూకాల్లో మోసాలపై మా దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– శంకర్, తూనికలు, కొలతల జిల్లా అధికారి

పట్టణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. చెరువుల అభివృద్ధి, వీధి లైట్ల ఏర్పాటు, రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జూన్ 30లోపు గృహ, వాణిజ్య పన్నుల వసూలు వంద శాతం వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ వార్డులో పారిశుద్ధ్య, డ్రై డే నిరంతరం కొనసాగించాలన్నారు. దోమల నియంత్రణకు అవసరమైన ఫాగింగ్ మిషన్లు సిద్ధంగా ఉంచాలని వీధి వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా మార్కెట్ ప్రాంతాల్లో తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. కూడళ్ల వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా చర్యలు

- ఎస్పీ జానకీషర్మిల



వరదల సమయంలో వినియోగించే సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: రానున్న వర్షాకాలంలో జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. వర్షాలతో ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సాయుధ దళ కార్యాలయంలో గురువారం ఫ్లడ్ రిలీఫ్ కోసం ఏర్పాటు చేసిన సామగ్రిని పరిశీలించారు. జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులు పూర్తిగా నిండనున్న దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు చేపడుతామన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఎయిర్ బోట్స్, లైఫ్ జాకెట్స్, ట్యూబ్స్, రోప్ వస్తువులు వాడకంపై పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాంనిరంజన్, రమేశ్, ఆర్‌ఎస్సైలు రవికుమార్, రాజశేఖర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్‌షాప్‌లో చోరీ

నస్పూర్: పట్టణ పరిధిలోని తెలంగాణ చౌరస్తా వద్ద గల ఓ వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లామని, బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. షాపులోని సుమారు రూ.12వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు.

అటవీశాఖ అదుపులో అనుమానితులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్దపులిని హతమార్చిన ఘటనలో పలువురిని అటవీశాఖ అధికారులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అగర్‌గూడ గ్రామానికి చెందిన ఒకరిని, కోయచిచ్చాలకు చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకుని విచారణ జరుపుతున్న అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అటవీశాఖ కస్టడీలో ఉన్న నిందితులు ఇస్తున్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన సుమారు 13 మందిని విచారిస్తున్నారు.

రహదారిపై నిలిపిన భారీ వాహనాలకు జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఎలాంటి కారణం లేకుండా నిలిపి ఉంచిన భారీ వాహనాలకు గురువారం ఎస్సై స్వరూప్‌రాజ్ జరిమానా విధించి డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రహదారులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వాహనాలు నిలిపి ఉంచడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం సంభవిస్తున్నాయన్నారు. ఇకపై రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఆపాల్సి వస్తే పార్కింగ్ లైట్లు వేసి రెడ్ ట్రయాంగిల్ స్టాండ్ ఏర్పాటు చేస్తూ రహదారిపై ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు, క్లీనర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

కిరాణా దుకాణం సీజ్

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమ్మ గార్డెన్ సమీపంలో గల ఓ కిరాణ దుకాణంలో కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సంతోష్ గురువారం తనిఖీలు నిర్వహించి షాప్‌ను సీజ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు బానేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కనుకదుర్గ కిరాణ షాపులో బుధవారం గడికొప్పుల లక్ష్మి అనే మహిళ బ్రెడ్ కొనుగోలు చేసింది. దానిని తెరిచి చూడగా బూజుపట్టి ఉంది. అనుమానం వచ్చి కవర్‌పైన ఎక్స్‌పైరీ డేట్ చూడగా ఈ నెల 18 వ తేదీ వరకు గడువు ఉంది. దుకాణం నిర్వాహకుడినిగా అడిగితే దురుసుగా ప్రవర్తించడంతో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు ఫిర్యాదు చేయగా తనిఖీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. గురువారం షాపులోకి వెళ్లి చూడగా కొన్ని తినుబండారాలు కాలం చెల్లినవి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని షాపు సీజ్ చేశారు.

విత్తన ఎంపికే కీలకం

- రైతులు సరైన వరి వంగడాలు ఎంచుకోవాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ

బెల్లంపల్లి: వానాకాలం సమీపిస్తోంది. మరో పక్షం రోజుల్లోగా ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుంది. ఇప్పటికే అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 25 నుంచి రోహిణి కార్తె మొదలు కానుంది. ఈ మేరకు రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు అనువైన వరి వంగడాలను సాగు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ సూచిస్తున్నారు. పంట దిగుబడి, చీడపీడలు తట్టుకునే గుణం కలిగిన వరి వంగడాల గురించి వివరించారు.

వరి రకాలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి అనువైన వరి వంగడాలు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక రకాలు ఉన్నాయి. దీర్ఘకాలిక రకం (150 రోజులు). ఈ రకం వంగడాలను జూన్ నెలాఖరు వరకు నాటుకోవాలి. మధ్యకాలిక రకాలు (135–140 రోజులు). జులై 15 వరకు నాటుకోవాలి. స్వల్పకాలిక రకాలు (120–125రోజులు) జులై చివరి వరకు నార్లు పోసుకుని 25 రోజుల్లోపు నాట్లు వేయాలి.



సాగు చేసిన కూనారం సన్నాల వరి పంట (ఫైల్)

శివకృష్ణ, శాస్త్రవేత్త

స్వల్పకాలిక రకాలు

తెలంగాణ వరి–4 (జేజీఎల్–25958): ఈ రకం వంగడం స్వల్పకాలిక దొడ్డు గింజ రకం. 115 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 65 క్వింటాళ్ల నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది.

కూనారం వరి–2 (కేఎన్‌ఎం–1638): 120 నుంచి 125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 76 నుంచి 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, బయోటైప్–3, అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది.

బతుకమ్మ: హెక్టారుకు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల పంట దిగుబడిని ఇస్తుంది. 115 నుంచి 120 రోజుల్లో పంటచేతికి వస్తుంది. ఎండాకు తెగులు, సుడిదోమ, పచ్చదోమ తట్టుకుంటుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది. గింజ రాలేగుణం తక్కువ.

జగిత్యాల రైస్(జేజీఎల్–24423): 120 నుంచి 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 85 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడు, సుడిదోమ, గో ధుమ రంగు, ఆకుపచ్చ తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. గింజ రాలేగుణం తక్కువ. చేను నే లపై పడిపోదు. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

మధ్యకాలిక రకాలు

వరంగల్ రైస్–1 (డబ్ల్యూజీఎల్–915): ఈ రకం వంగడం పొడవు, దొడ్డు, గింజనాణ్యత కలిగి ఉంటుంది. అటుకులు, మరమరాల (పేలాలు) తయారీకి అనువైనరకం. 135 రోజులకు కోతకు వస్తుంది. వానాకాలం సాగుకు ఈరకం ఎంతో ఉత్తమమైంది. అగ్గి తెగులు, సుడిదోమ, ఎండాకు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

కూనారం సన్నాలు(కేఎన్‌ఎం–118): ఈ రకం వంగడం 118 నుంచి 120 రోజుల్లో పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్లను తట్టుకుంటుంది. సుడిదోమను కొంతవరకు నివారిస్తుంది.

తెలంగాణ వరి–2 (డబ్ల్యూజీఎల్–697): ఈరకం వంగడం పంటకాలం 135 రోజులు. సన్నగింజ, నాణ్యతతో ఉంటుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సుడిదోమ, అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగులును తట్టుకుంటుంది.

సోమనాథ్: ఈ రకం వంగడం 130 నుంచి 135 రోజులకు పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. సన్న గింజరకం. ఉల్లికోడును తట్టుకుంటుంది. అగ్గితెగులును కొంతవరకు తట్టుకునే శక్తి ఉంటుంది. నారుమడి దశలో కొంతవరకు చలిని సైతం తట్టుకుంటుంది.

కంపాసాగర్ వరి (కేపీఎస్ 2874): ఈరకం వంగడం 140 రోజుల్లో పంట చేతికి అందివస్తుంది. అధిక దిగుబడిని ఇస్తుంది. గింజలు సన్నగా ఉంటాయి. సాంబమసూరితో పోలిస్తే పైరు ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక రకాలు

ఇంద్ర (ఎంటీయూ–1061): ఈ రకం వంగడం 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. దోమను తట్టుకుంటుంది. నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేయడానికి అనువైనది.

తెలంగాణ సోన (ఆర్‌ఎన్‌ఆర్–15048): ఈ రకం వంగడం పంట కాలం 125 రోజులు. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. అతి సన్నబియ్యం. తక్కువ నూక శాతంతో అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. గ్లైమిక్ ఇండెక్స్ తక్కువ.

జగిత్యాల సన్నాలు (జేజీఎల్–1798): ఈరకం వంగడం పంటకాలం 120 రోజులు. హెక్టార్‌కు 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఉల్లికోడును తట్టుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. సాగుకు అనువైన రక.

సాంబ మసూరి (బీపీటీ–5204): ఈ రకం వంగడం 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. హెక్టార్‌కు 65 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. బియ్యం సన్నగా ఉంటాయి. అన్నం ఎంతో నాణ్యతగా ఉంటుంది. ఏ రకమైన చీడపీడలను తట్టుకోలేదు.

కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి

- ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం వాటిని వినియోగించకుండా దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా గిరిజనుల్లో అత్యంత వెనుకబడిన వర్గాలైన చెంచు, కోయ వర్గాల ప్రగతికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటికి ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. ఓవైపు రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే ఏమి చేయలేదని విమర్శిస్తూనే, కేంద్రం నుంచి వచ్చిన నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. గతేడాది అక్టోబర్‌లో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి రూ.152 కోట్లు కేంద్రం నుంచి విడుదలైతే ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని విమర్శించారు. అక్టోబర్, మార్చి నెలల్లో సుమారుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.397 కోట్లు రాగా, వాటిని విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని అడ్డుకుంటుందని మండిపడ్డారు. ఈ నెల 25లోగా కేంద్రం విడుదల చేసిన నిధులు అన్నింటినీ రిలీజ్ చేయాలని, లేనిచో గిరిజన సంఘాలతో కలిసి ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు అస్టక్ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఇందిరమ్మ ఇళ్లకు 'ఐఎఫ్‌ఎస్‌సీ' సమస్య

- పలు బ్యాంకులకు మారిన కోడ్‌లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు డబ్బులు జమ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బ్యాంకుల ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌లు మారడంతో తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాలు ఉన్న లబ్ధిదారులకు ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు గతంలో ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీహెచ్, తదితర విలీన బ్యాంకులుగా ఉన్న పాత ఖాతాలే ఇచ్చిన చోట్ల సమస్యలు ఉన్నాయి. సర్వే జరిపినప్పుడు పాత కోడ్‌లే ఉండడంతో అవే వివరాలు అందించారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో పలువురు లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ నుంచి డబ్బులు విడుదల చేస్తున్నప్పటికీ ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు జాప్యం జరుగుతోంది. పునాదుల దశలో ఉన్న వారికి రూ.లక్ష జమ చేస్తున్న నేపథ్యంలో ఈ సమస్య తీర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు. రాష్ట్రంలో ఇదే తీరుగా పలు జిల్లాల్లోనూ ఈ సమస్య ఉత్పన్నమైనప్పటికీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను మార్చేలా అవకాశం లేక ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీనిపై మంచిర్యాల హౌసింగ్ కార్పొరేషన్ పీడీ బాన్సీలాల్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఉన్నతాధికారులకు నివేదించామని ఎంపీడీవోలకు ఎడిట్ ఆప్షన్ ఇస్తే సమస్య తీరుతుందని తెలిపారు.

మూడు తరాల నుంచి భూదానం

- వారసత్వంగా భూమిని దానం చేస్తున్న కుటుంబం

సాత్నాల: తాత నుంచి మనవళ్ల వరకు భూదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన నాలం కుటుంబం. ఊరి కోసం తమవంతు సాయంగా లక్షల రూపాయల విలువచేసే భూమిని విరాళంగా అందించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. భోరజ్ మండలంలోని జాతీయ రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో గిమ్మ గ్రామం ఉంది. గ్రామానికి చెందిన నాలం కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో ఆ ఊరి ప్రజల రాకపోక కోసం తారు రోడ్డు నిర్మాణం కోసం భూమిని వదిలిపెట్టారు. గ్రామంలోని పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవనం, వసతిగృహం కోసం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆస్పత్రి, పశువుల కోసం వెటర్నరీ ఆస్పత్రి, శ్మశాన వాటిక, రైతువేదిక నిర్మాణానికి ఆరున్నర ఎకరాల భూమిని విరాళంగా అందించారు. తాత నాలం రాములు నుంచి మనవళ్లు నాలం వామన్, నాలం అనిల్ వారసత్వంగా భూదానం చేస్తున్నారు. నాలం రాములు, అతని కుమారుడు వామన్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వామన్ కుమారుడు నాలం అనిల్‌సైతం తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ తాత దారిలోనే పయనిస్తున్నాడు.



విరాళం ఇచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి

తోచిన సాయం చేస్తా



మా తాత రాములు, నాన్న వామన్ మదిలో గ్రామాభివృద్ధికోసం ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. ఊరి కోసం ఆరెకరాల భూమిని అందించారు. నేను కూడా నాకు తోచిన సాయం చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా. ఇటీవల రైతు వేదిక కోసం భూమిని విరాళంగా ఇచ్చాం.

– నాలం అనిల్

పనిచేయని 'ఇరిగేషన్' ఫోన్లు

- తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతున్న వైనం

దండేపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ఇరిగేషన్ అధికారుల 91549 సిరీస్‌గల ఫోన్‌నంబర్లు కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఫోన్‌చేస్తే ఈనంబర్ నందు ఇన్‌కమింగ్ కాల్ సౌకర్యం తాత్కాలికంగా అందుబాటులో లేదని చెబుతోంది. ఇరిగేషన్ అధికారుల డిపార్ట్‌మెంట్ నంబర్లకు రీచార్జ్ చేయక పోవడంతో అవి పనిచేయడం లేదని సమాచారం. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, ఉప్పొంగితే ఏదైనా ప్రమాదం జరిగితే ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలంటే వారి ఫోన్‌నంబర్లు పనిచేయక పోవడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. బడ్జెట్ లేని కారణంగానే డిపార్ట్‌మెంట్ ఫోన్ నంబర్లకు రీచార్జీ చేయలేదని తెలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇరిగేషన్ శాఖ డిపార్ట్‌మెంట్ ఫోన్‌నంబర్లకు రీచార్జ్ చేయించి పనిచేసేలా చేయాలని పలువురు కోరుతున్నారు.

'బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలి'

పాతమంచిర్యాల: బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2026 నాటికి మావోయిస్టు పార్టీని లేకుండా చేయాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం నరమేధానికి ఒడిగట్టిందన్నారు. ఏడాదికాలంలో 540 మందిని ఎన్‌కౌంటర్ల పేర చంపేశారని, అందులో అమాయకులు, సామాన్య పౌరులు కూడా ఉన్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీంకోర్టుచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బ్రహ్మానందం, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి దేవరాజ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట సత్యం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నకిలీ పత్రాలు సృష్టించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కాజేద్దామని పన్నాగం పన్నిన ముగ్గురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరొకరు పరారీలో ఉన్నారు. గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌రావు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో ఆరె సుదర్శన్‌కు చెందిన ప్లాట్ నకిలీ దస్తావేజులను పవార్ నవనీత్, గంధ్రత్ మహేందర్, పడాల చేతన్ కుమార్ సృష్టించారు. కాలనీలోని 122 చదరపు అడుగుల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో ఏ–1 నవనీత్ కొనుగోలుదారుడిగా, ఏ–3 పడాల చేతన్ అమ్మిన వ్యక్తిగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏ–2 గంధ్రత్ మహేందర్ సహాయంతో పత్రాలు సృష్టించారు. మున్సిపాలిటీలో డోర్ నంబర్ తీసుకొని అధికారులను మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పవార్ నవనీత్, గంధ్రత్ మహేందర్‌లను అరెస్టు చేయగా పడాల చేతన్ పరారీలో ఉన్నాడు. నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. డోర్ నంబర్ ఇచ్చే విధంగా, నకిలీ పత్రాలు సృష్టించే విధంగా ప్రభుత్వ అధికారులు సహకరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన వ్యక్తిపై ..

నెన్నెల: సోలార్ ఫెన్సింగ్ దొంగిలించిన మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కాల్వ సతీశ్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన రైతు సరండ్ల భూమయ్య తన పొలం చుట్టూ వేసుకున్న ఫెన్సింగ్‌ను బుధవారం రాత్రి సతీష్ అనే వ్యక్తి దొంగిలించాడు. తాగిన మైకంలో తానే దొంగలించానని బోయిని రమేశ్ అనే వ్యక్తితో చెప్పడంతో విషయాన్ని బాధిత రైతు భూమయ్యకు సమాచారం చేరవేశాడు. భూమయ్య గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లక్సెట్టిపేట: ఈ నెల 19న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామానికి చెందిన ఎలగతి శ్రీలత (29)కు అదే గ్రామానికి చెందిన సురేష్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కొద్దిరోజులుగా కూతురు ఆద్యశ్రీ అనారోగ్యానికి గురైంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈనెల 19న గడ్డిమందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- చెట్టు విరిగిపడి మహిళ మృతి

జన్నారం: బంధువుల ఇంట్లో పెండ్లికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఈదురు గాలులకు చెట్టు విరిగి మీదపడడంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన శనిగారపు జగన్, అతని భార్య సునీత (37)తో కలిసి బుధవారం కడెం మండలంలోని లింగాపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి 9 గంటల ప్రాంతంలో జన్నారం మండలం మహ్మదబాద్ గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి బలమైన గాలులు వీయడంతో చెట్టు విరిగి సునీతపై పడడంతో బైక్‌పై నుంచి ఇద్దరు కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సునీత అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జగన్‌ను మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి చెవుల మద్ది శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సునీత (ఫైల్)

విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో గోళ్ల తిరుపతికి గల పాడి ఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లే సమయంలో రోడ్డు పక్కన ఉన్న ఇనుప స్తంభానికి తగలడంతో షాక్‌కు గురైన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ఇనుప స్తంభానికి షాక్ వస్తోందని రెండు మూడు రోజులుగా విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. గ్రామంలో గల ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంజనీతండాలో..

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాలో రాథోడ్ దుర్గాదాస్ అనే రైతుకు చెందిన ఆవు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందింది. దేవుని చెరువు దారిలో ఆవు మేత మేస్తుండగా మినీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్తింగ్ రాడ్, వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి ముక్తార్ అహ్మద్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఆవు విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని, నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.



దండేపల్లి: ఆవును చూపిస్తున్న రైతు తిరుపతి

కారులో చెలరేగిన మంటలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పార్కింగ్ చేసి ఉన్న కారులో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే కుడి వైపు ఉన్న పాఠశాల గదిలో డీఈవో రామారావుతో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఎడమ వైపున ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో సమీక్షలో పాల్గొన్న అధికారులు, ఇతర కార్యాలయాల అధికారులు ఒక్కసారిగా హైరానా పడ్డారు. కాగా కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న సత్తన్‌పల్లి డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌కు చెందిన కారుగా గుర్తించారు. కారులోని బ్యాటరీ వైర్లు ఎర్తింగ్ అయి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. వెంటనే కారు అద్దాలు పగుల గొట్టి అందులోని బ్యాగులు, ఇతర సామగ్రి బయటకు తీసి అక్కడే అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ పోసి మంటలు అదుపు చేయడంతో పాటు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను మానసికంగా, శారీరకంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మి గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎ.వెంకటమ్మ తెలిపారు. భోరజ్ గ్రామ సమీపంలో జీఎంఆర్ స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్ వద్ద నిందితుడు సిడాం హిమంత్‌రావు అతని భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తుండడంతో 2019 జూన్ 23న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు డ్యూటీ అధికారి జమీర్ 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షైని సుల్తాన విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

విద్యార్థినిని వేధించిన ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: దళిత విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.9వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి పండరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని ప్రైవేటు స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఫని మోహన్‌రావు ఓ మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. 2024 జనవరి 3న ప్రిన్సిపాల్ ఆ విద్యార్థిని తన క్యాబిన్‌లోకి పిలిచి దురుసుగా ప్రవర్తించాడు. అప్పటి మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసు అధికారి సీహెచ్.సంతోష్ 17 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. పీపీ ప్రవీణ్ కుమార్ నేరం రుజువు చేయగా జిల్లా అదనపు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్టు

బాసర: బాసర మండలం కౌట గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన గైక్వాడ్ విలాస్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. గైక్వాడ్ విలాస్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతి వెంట పడ్డాడు. దీంతో ఇద్దరూ కొంత కాలం ప్రేమించుకున్నారు. 20 రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన తీసుకురాగా గ్రామం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితురాలు వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం గ్రామానికి వచ్చిన గైక్వాడ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.